సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

బుధవారం । 21 । మే । 2025



అన్న ప్రసాద భవనానికి విరాళం

కొత్తపేట: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్న ప్రసాద భవన నిర్మాణానికి కర్రి వెంకటరెడ్డి - కమలావతి దంపతులు (రావులపాలెం) మంగళవారం రూ.1,01,116 విరాళం అందజేశారు.



శివసదన్‌కు రూ.10 లక్షలు

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో శివసదన్ సత్రంలో ఒక గదికి కిండేపూడి వరలక్ష్మి (విశాఖపట్నం), బుద్ధిరాజు లలితా సుందరి (ఏలూరు) రూ.10 లక్షల విరాళం అందజేశారు.

సముద్రంలోకి 7,910 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 7,910 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.90 అడుగులకు తగ్గింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

కొబ్బరి పార్కు, విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు దిశగా..



మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవితో జిల్లా అధికారుల బృందం

సాక్షి, అమలాపురం: కొబ్బరి పార్కు, కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమలను కోనసీమలో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని జిల్లా యంత్రాంగం ప్రకటించింది. దీనిలో భాగంగా తమిళనాడు, కేరళ, కర్ణాటకలలో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఒక బృందం పర్యటించింది. ఇందుకు సంబంధించిన వివరాలను పరిశ్రమల శాఖ జిల్లా అధికారి టి.ప్రసాద్ మంగళవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ బృందం సాంకేతిక పరిజ్ఞానం, ఉత్తమ ఆచరణ పద్ధతుల అధ్యయనం కోసం మైసూరు, కాసర్గోడ్, కొచ్చిన్, కోయంబత్తూర్‌లో పర్యటించింది. జిల్లాలో కోకోనట్ పార్క్, కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటు లక్ష్యంగా ఈ పర్యటన సాగిందన్నారు. వీటికి అవసరమైన స్థలాలు, సాంకేతికత, సరఫరా, మార్కెట్ లింకేజెస్ వంటి అంశాలపై అధ్యయనం చేసేందుకు వెళ్లిన ఈ బృందంలో ప్రసాద్‌తోపాటు డీఆర్‌డీఏ పీడీ జయ చంద్రగాంధీ, జిల్లా ఉద్యానశాఖ అధికారి బి.వి.రమణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ రమణారెడ్డి, ఎల్‌డీఎం వర్మ ఉన్నారు. మైసూరు సీఎఫ్‌టీఆర్, కాసర్గోడ్‌లోని సీపీసీఆర్ఐ, కొచ్చిలోని కోకోనట్ బోర్డు, కోయింబత్తూరులో ప్రైవేట్ పరిశ్రమలను పరిశీలించారు. నూతన వంగడాలు, రోగ నిరోధకత కలిగిన కొబ్బరి రకాలు, కోనసీమ వాతావరణానికి అనుకూల వంగడాలపై సమగ్ర చర్చలు జరిపారు. కొబ్బరి ఫైబర్ ప్రాసెసింగ్, కొబ్బరి నీటిని బ్రాండెడ్ ఉత్పత్తిగా తయారు చేయడం, కాయర్ పరిశ్రమలకు అవసరమైన మిషనరీ వివరాలు సేకరించారు. ప్రైవేట్ కొబ్బరి పరిశ్రమలను పరిశీలించి, వాటి నిర్వహణ, మార్కెటింగ్ మోడల్స్, రైతులకు లాభదాయకత తదితర అంశాలపై అధ్యయనం చేసి, వాటిని జిల్లా స్థాయిలో ఎలా అమలు చేయాలనే దానిపై ప్రణాళికలు రూపొందించారు. దీనిపై కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు నివేదిక అందజేయనున్నారు. అనంతరం ప్రభుత్వ ప్రమాణాలతో కూడిన పారిశ్రామిక మోడల్‌ను అమలు చేసే దిశగా చర్యలు చేపట్టనున్నట్టు ప్రసాద్ తెలిపారు.

విఘ్నేశ్వరస్వామివారి హుండీ ఆదాయం రూ.27,68,281



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి హుండీ ఆదాయాన్ని అమలాపురం ఆలయ తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. 61 రోజులకు గాను స్వామివారికి హుండీల ద్వారా రూ.27,68,281 లభించిందని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. 4.4 గ్రాముల బంగారం, 436 గ్రాముల వెండి లభించాయన్నారు. 30 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు చెప్పారు.

పరీక్షా కేంద్రంలో ముగ్గురే విద్యార్థులు!

అమలాపురం టౌన్: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు ముగ్గురంటే ముగ్గురే ఒకే ఒక పరీక్షా కేంద్రంలో మంగళవారం జాగ్రఫీ పరీక్ష రాశారని డీఐఈవో వనుము సోమశేఖరరావు తెలిపారు. ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఆ పరీక్ష రాయాల్సిన ముగ్గురు విద్యార్థులు హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు. దీంతో జిల్లాలో మొత్తం ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారంతో పూర్తయ్యాయని తెలిపారు.

24న మెగా జాబ్‌మేళా

అమలాపురం రూరల్: ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల (ముమ్మిడివరం)లో ఈ నెల 24వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రచార వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. జాబ్‌మేళాలో 11 కంపెనీలకు చెందిన అధికారులు పాల్గొని సుమారు 560 పైగా ఖాళీలను భర్తీ చేయనున్నారన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన వారికి ఇది అవకాశమని తెలిపారు. వివరాలకు 82476 45389 నంబర్‌లో సంప్రదించాల్సిందిగా జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి డి. హరిశేషు తెలిపారు.

బాబుగారి చౌకబారు నిర్ణయం

- ఎండీయూ వాహనాల రద్దుకు రంగం సిద్ధం
- జీవనోపాధి కోల్పోనున్న 355 మంది
- రేషన్ కోసం ఇక పనులు మానుకోవాల్సిందే
- గడువుకు ముందే రద్దు యోచనపై ఆపరేటర్ల నిరసన
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి వచ్చిన మంచిపేరు చెరిపేయాలనే..



ఎండీయూ వాహనం వద్ద రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు

ఆలమూరు: నిరుపేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు నేరుగా ఇంటికి వెళ్లి రేషన్ సరకులను అందించే మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ)లను రద్దు చేసే దిశగా ప్రభుత్వం యోచిస్తుండడం ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. చౌకధరల దుకాణాలకు వెళ్లి సరకులను తీసుకోవడంలో ఉన్న ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని, జనం దైనందిన జీవనానికి ఆటంక మేర్పడకూడదని, జీవనోపాధికి ఆటంకం ఏర్పడకూడదన్న ఉద్దేశంతో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎండీయూ వ్యవస్థను ఆచరణలోకి తీసుకువచ్చారు. ఒక్కొక్క వాహనానికి ముగ్గురేసి చొప్పున నియమించి వారందరికి జీవనోపాధిని కల్పించారు. ఏళ్ల తరబడి నిరంతరాయంగా ఇంటింటికి సేవలను అందిస్తున్న ఎండీయూలను రద్దు చేసేందుకు ప్రభుత్వం సమాలోచనలు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పౌరసరఫరాలశాఖ ఇటీవల దశల వారీగా ఎండీయూ వాహన ఆపరేటర్లు, రేషన్ డీలర్ల సంఘ నాయకులతో జరిపిన చర్చల్లో రద్దు ప్రతిపాదన తీసుకురావడంపై ప్రజల్లో ఆందోళన నెలకొంది. దీనికితోడు మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఎండీయూ వ్యవస్థకు మంగళం పాడాలని నిర్ణయించడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

జిల్లాలో ఇలా..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 515 గ్రామ సచివాలయాలు ఉండగా అందులో 5.38 లక్షల రేషన్‌కార్డులకు గాను 906 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఈరేషన్ లబ్ధిదారులకు సంబంధించి 355 ఎండీయూ వాహనాల్లో 1,065 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రతి నెలా ఒకటి నుంచి 17వ తేదీ వరకూ ఎండీయూ ఆపరేటర్లు ఇంటింటికి వెళ్లి రేషన్ అందిస్తున్నారు. జిల్లాలో ప్రతినెలా సుమారు 8,190.16 మెట్రిక్ టన్నుల బియ్యం, 265.20 మెట్రిక్ టన్నుల పంచదారతో పాటు అప్పుడప్పుడు కందిపప్పును నేరుగా లబ్ధిదారుడికే పంపిణీ చేస్తున్నారు. రేషన్ పంపిణీని పూర్తి పారదర్శకంగా, ఎటువంటి అవినీతికి తావు లేకుండా లబ్ధిదారులు అందుబాటులో ఉండే సమయానికే ఇంటికి వెళ్లి రేషన్ సరకులను అందిస్తున్న ఎండీయూ వాహనాలను నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వం పయనించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గత ప్రభుత్వ పథకాన్ని నిర్వీర్యం చేయాలనే..

గత వైఎస్సార్ సీపీ హయాంలో జనవరి 2020 నుంచి ఈ ఎండీయూ వ్యవస్థ పనిచేస్తోంది. ఇంటింటికి రేషన్‌ను అందిస్తూ ప్రజల మన్ననలను అందుకున్న ఎండీయూ వాహనాల పంపిణీని రద్దు చేసి గత ప్రభుత్వ ఆనవాళ్లు చెరిపివేయాలనే కూటమి ప్రభుత్వం ఇటువంటి చౌకబారు నిర్ణయం తీసుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏళ్ల తరబడి రేషన్ దుకాణాల్లో ఉపాధి పొందుతున్న డీలర్లను తొలగించకుండా గత ప్రభుత్వం వారికి ప్రతి నెలా కమీషన్‌ను అందించింది. దీంతోపాటు బియ్యం, పంచదారతో వచ్చే గోనె సంచులను కూడా రేషన్ డీలర్లకే అప్పగించి ఆ కుటుంబాలను ఆదుకుంది. అప్పటి ప్రభుత్వానికి ఈ విధానం భారమైనా ప్రజల సౌకర్యం కోసం ఎండీయూ వాహన వ్యవస్థను సమర్థంగా అమలు చేసింది. ఏదైనా ఫిర్యాదులు, సమస్యలు ఉత్పన్నమైతే 1967 టోల్ ఫ్రీ నంబరును ఆనాటి ప్రభుత్వం ఏర్పాటు చేసి పారదర్శకతకు, జవాబుదారీతనానికి పెద్దపీట వేసింది.

ఒప్పంద గడువు ఉన్నా తొందరెందుకు?

ఎండీయూ వ్యవస్థను ప్రవేశపెట్టే సమయంలో ఆపరేటర్లకు, ప్రభుత్వానికి మధ్య జరిగిన ఒప్పంద గడువు 2027 జనవరికి ఉన్నా అర్ధాంతరంగా తొలగింపు నిర్ణయం తీసుకోకపోవడం సరికాదని ఎండీయూ ఆపరేటర్లు మండిపడుతున్నారు. వాహనాలకు తీసుకున్న రుణం ఇంకా తీరకున్నా, పంపిణీలో ఏ విధమైన ఆరోపణలు లేకున్నా రద్దు దిశగా చర్యలు తీసుకుంటే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నారు. ఐదేళ్ల పాటు నిరంతరాయంగా అనేక కష్టనష్టాల కోర్చి ఇంటింటికి వాహనాన్ని తీసుకువెళ్లి రేషన్ సరకులను సక్రమంగా అందించినందుకు ప్రోత్సహించవలసిన కూటమి ప్రభుత్వం వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా పావుల కదపడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతి ఎండీయూ వాహనాన్ని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు క్షుణ్ణంగా పరిశీలించి అనుమతించిన తరువాత తూనికల కొలతల శాఖ అధికారులు వేయింగ్ మెషీన్లను తనిఖీ చేసిన తరువాత మాత్రమే ప్రజలకు రేషన్ అందించి ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా సేవలను అందించిన విషయాన్ని ఎండీయూ ఆపరేటర్లు గుర్తు చేస్తున్నారు.

రేషన్ సరకుల కోసం తప్పని కుస్తీ

ఎండీయూ వాహనాలను రద్దు చేస్తే రేషన్ సరకుల కోసం కుస్తీ తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రోజంతా పనులు మానుకుని సుదూర ప్రాంతంలో ఉన్న రేషన్ షాపునకు వెళ్లి సరకులు తెచ్చుకోవలసిన పరిస్థితుల ఉత్పన్నమవుతాయి. ఒకవేళ సర్వర్లు మొరాయిస్తే అక్కడే పడిగాపుల పడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఒక్కొక్కసారి మరుసటి రోజు వెళ్లి రేషన్ సరకులను తీసుకోవలసి ఉంటుంది. దీనివల్ల లబ్ధిదారుల జీవనోపాధి దెబ్బతినే అవకాశం ఏర్పడుతుంది.

జీవనోపాధిపై దెబ్బ కొట్టొద్దు



రేషన్ సరకులను అవినీతికి తావు లేకుండా ఇంటింటికీ వెళ్లి అందిస్తున్న ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, డ్రైవర్లు, హెల్పర్ల జీవనోపాధిపై దెబ్బ కొట్టొద్దు. ఉపాధి కల్పిస్తున్నారనే ఉద్దేశంతో ఐదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వ సాయంతో వాహనాలను తీసుకుని ప్రతి నెలా సక్రమంగా వాయిదాలు చెల్లిస్తున్నాం. ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– మేడిశెట్టి సత్యనారాయణ, ఎండీయూ ఆపరేటర్, పినపళ్ల, ఆలమూరు మండలం

ఇంటికే రేషన్ సరకులు అందించాలి



ఇప్పటి వరకూ అమలులో ఉన్న ఎండీయూ వాహనాల ద్వారానే ఇంటింటికి వచ్చి రేషన్ సరకులను అందించాలి. ఉపాధి కోసం పురుషులు పనులకు వెళితే ఇంట్లో ఉన్న మహిళలు రేషన్ సరకులను తీసుకుంటున్నారు. ఎండీయూ వాహన వ్యవస్థను రద్దు చేస్తే మళ్లీ పాత పరిస్థితులే పునరావృత్తమై ఇక్కట్లు తప్పవు.

– సూరంపూడి శ్రీనివాసు, కార్మికుడు, పెనికేరు, ఆలమూరు మండలం

విక్రయ వస్తువుపై ధర, బరువు ఉండాలి

లీగల్ మెట్రాలజీ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రాజేష్



సదస్సులో మాట్లాడుతున్న లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కమిషనర్ రాజేష్

అమలాపురం టౌన్: విక్రయ వస్తువుల ప్యాకెట్లపై దాని ధర, బరువు లేదా కొలత విధిగా ఉండాలని అమలాపురం తూనికలు, కొలతలశాఖ (లీగల్ మెట్రాలజీ) అసిస్టెంట్ కమిషనర్ కె.రాజేష్ సూచించారు. కొనుగోలు చేసే ప్రతి వస్తువులకు సంబంధించి దుకాణదారుని నుంచి బిల్లును అడిగే చైతన్యం వినియోగదారుల్లో రావాలని అన్నారు. అంతర్జాతీయ లీగల్ మెట్రాలజీ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎర్రవంతెన వద్ద గల ఆ శాఖ కార్యాలయంలో పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కొన్ని వస్తువులకు బిల్లులు అడగడం ఓ హక్కుగా వినియోగదారులు భావించాలన్నారు. ముఖ్యంగా బంగారం విక్రయాలకు సంబంధించి వినియోగదారులకు ఇచ్చే బిల్లులపై విధిగా ఆ బంగారం ఎన్ని క్యారెట్లు వంటి వివరాలు ఉండాలని సూచించారు. వ్యాపార సంఘాల ప్రతినిధులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రాష్ట్ర బంగారం, వెండి వర్తకుల సంఘం కోశాధికారి అనిల్‌కుమార్ జైన్, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ మాట్లాడుతూ తూనికలు, కొలతల నిబంధనలపై వ్యాపారస్తులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. వినియోగదారుల సంఘాల ప్రతినిధులు అమరేశ్వరరావు, అభిరామ్, అమలాపురం బంగారు, వెండి వర్తకుల సంఘం అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, మెడికల్ అసోసియేషన్ ప్రతినిధిగా మోకా వెంకట సుబ్బారావు, ఎల్రక్టానిక్స్ అసోసియేషన్ ప్రతినిధిగా దొమ్మేటి సాయిబాబు, వ్యాపారులు కొవ్వూరి వెంకటరెడ్డి, రేకపల్లి సత్యనారాయణమూర్తి, రాయుడు నాని, అనుపోజు శ్రీను, చవాకుల కృష్ణ, చింతలపూడి సత్తిబాబు ప్రసంగించారు. లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ గోకరకొండ వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటి అవసరాలకు 24 గంటలూ విద్యుత్ సరఫరా



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: తాగునీటి అవసరాలకు 24 గంటలూ విద్యుత్ సరఫరా ఉండాలని కలెక్టర్ ఆర్. మహేష్‌కుమార్ ఏపీ ట్రాన్స్‌కో ఇంజినీర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించి విద్యుత్ టవర్ల ఏర్పాటు సందర్భంలో పవర్ కట్ అంశాలపై సమీక్షించారు. అమలాపురం డివిజన్‌లో మాత్రమే 24 గంటల వ్యవధిలో కేవలం 3 గంటల పాటు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 90 టవర్లు వేయాల్సి ఉండగా ఇప్పటివరకు 60 టవర్లు నిర్మించినట్లు తెలిపారు. రామచంద్రపురం డివిజన్, కొత్తపేట డివిజన్‌లో ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట మండలాల్లో మినహా మిగిలిన మండలాలలో విద్యుత్ పవర్ కట్ ముందుగా నిర్దేశించిన గ్రామాలలో ఉంటుందని తెలిపారు. విద్యుత్ అంతరాయం ఉదయం 11 నుంచి 5 గంటల మధ్య ఉంటుందన్నారు. ఏపీ ట్రాన్స్‌కో విశాఖపట్నం జోనల్ చీఫ్ ఇంజినీర్ బి.శ్యాంప్రసాద్, ఎస్ఈ సిద్ధాల రాజబాబు, గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్య శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ సీహెచ్ ఎన్వి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

క్లోజర్ పనులను వేగవంతం చేయాలి

వేసవి కాలువలు మూసి వేత సమయంలో వివిధ గ్రాంట్ల కింద మంజూరైన క్లోజర్ పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జలవనరులు డ్రైనేజీ శాఖ ఇంజినీర్లతో పనులపై సమీక్షించారు.

మోసపూరిత హామీలు బాబుకు అలవాటే



గిరిజాకుమారి

ఉప్పలగుప్తం: ప్రతి ఎన్నికలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి రావడం, వచ్చిన తరువాత వాటిని గాలి కొదిలేయటం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అలవాటేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వంగా గిరిజకుమారి విమర్శించారు. మండలంలోని సన్నవిల్లి గ్రామంలో ఆమె స్వగృహంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మోసపూరిత హామీలతో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తోందన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 18 నుంచి 59 సంవత్సరాలు కలిగిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున సంవత్సరానికి రూ.18,000 అందిస్తానని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చాక హామీ అమలు చేయడానికి డబ్బు లేదంటున్న చంద్రబాబుకు ఎన్నికల మేనిఫెస్టోలో పథకాన్ని పెట్టేముందు ఆ విషయం తెలియదా అని ప్రశ్నించారు. వైఎస్సార్ చేయూత పథకంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలలో 45 సంవత్సరాలు దాటిన మహిళల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా సంవత్సరానికి రూ.18,750 చొప్పున నాలుగు సంవత్సరాల్లో రూ.75,000, కాపు మహిళలకు సంవత్సరానికి రూ.15వేలు అందించి, ఆర్థికంగా ఆదుకున్న ఘనత మాజీ ముఖ్యమంత్రి జగనన్నకు దక్కిందని అన్నారు.

జగన్‌కు వరి కంకులను బహూకరించిన రైతు



మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వరి కంకులను బహూకరిస్తున్న రైతు సత్యనారాయణ

రావులపాలెం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఒక రైతు తాను పండించిన వరి కంకులను బహూకరించారు. తాడేపల్లి వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సంస్థల నాయకులు, రైతులు జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. రావులపాలెం మండలం పొడగట్లపల్లికి చెందిన రైతు మెర్ల సత్యనారాయణ తాను పండించిన వరి కంకులను జగన్‌కు బహూకరించారు. ప్రస్తుతం అన్నదాత పడుతున్న ఇబ్బందులను, రైతుల గోడును జగన్‌కు వివరించారు. అన్నదాతకు వైఎస్సార్ సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని జగన్ హామీ ఇచ్చారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు, కొత్తపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

అసలే జాప్యం.. ఆపై గోప్యం

- జిల్లాలో పూర్తయిన జాతీయ పశుగణన
- ఇంకా లెక్కలు వెల్లడించని కేంద్ర ప్రభుత్వం

జిల్లాలో ఉన్న మూగజీవాలు

	19వ జాతీయ పశు గణన	20వ జాతీయ పశు గణన
ఆవులు	3,77,257	2,26,740
గేదెలు	6,43,948	6,29,662
గొర్రెలు	2,47,670	3,37,603
మేకలు	2,94,054	1,94,653
పందులు	32,723	39197
పౌల్ట్రీ, నాటు కోళ్లు	2,83,37,640	3,06,24,292



పశుగణన చేస్తున్న సిబ్బంది (ఫైల్)

రాయవరం: మూగజీవాల గణన జిల్లాలో గతేడాది అక్టోబర్ 25న ప్రారంభమైంది. ప్రతి ఐదేళ్లకు ఒకసారి చేపట్టాల్సిన గణన ఏడాది ఆలస్యంగా ప్రారంభించారు. అసలే ఆలస్యంగా గణన ప్రారంభించి పూర్తి చేసినా దాని వివరాలు ఇంకా కేంద్ర ప్రభుత్వం వెల్లడించలేదు. ఆ వివరాలను వెల్లడిస్తేనే బడ్జెట్, పశువులకు అవసరమయ్యే వ్యాక్సిన్లు, మందులు, పథకాలు రూపొందించే అవకాశముంటుంది. 21వ జాతీయ పశుగణనను పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. పశుగణనను ఐదున్నర నెలల పాటు సిబ్బంది చేపట్టారు. 19వ జాతీయ పశుగణన 2014లో, 20వ పశుగణన 2019లో నిర్వహించారు.

340 మంది సిబ్బందితో..

పక్కాగా పశుగణన చేపట్టేందుకు జిల్లావ్యాప్తంగా 286 మంది ఎన్యూమరేటర్లు, 54 మంది సూపర్‌వైజర్లను నియమించారు. జిల్లా వ్యాప్తంగా 425 రెవెన్యూ గ్రామాలు, వార్డులను 286 మంది ఎన్యూమరేటర్లు గణన చేశారు. ప్రతి రెవెన్యూ విలేజ్‌కు ఒక ఎన్యూమరేటర్‌ను నియమించారు. పశుగణనలో భాగంగా గ్రామాల్లో ప్రతి నివాసాన్ని ఎన్యూమరేటర్ సందర్శించి, గేదెలు, ఆవులు, వాటి జాతులు, కోళ్లు, వాటి రకాలు, గొర్రెలు, మేకలు, పందులు, కుక్కలు తదితర పశు జాతులను నమోదు చేశారు. ఈసారి ఎన్యూమరేటర్ ఫోన్‌లోనే యాప్ ద్వారా ఎన్యూమరేషన్ చేపట్టారు.

పెరిగిన కుటుంబాలు

2019లో 4,83,292 కుటుంబాలను గణన చేశారు. ఈసారి ఫిబ్రవరి 25వ తేదీ నాటికి 5,56,295 కుటుంబాల గణన చేపట్టారు. ప్రతి గ్రామంలో ఆవుల్లో ఒంగోలు, పుంగనూరు, సాహివాల్, గిర్, జెర్సీ, హెచ్ఎఫ్ సంకరజాతి, గేదెల్లో ముర్రా, గ్రేడెడ్ ముర్రా, కోళ్లలో టర్కీ, నాటు, కముజు పిట్టలు, ఫారం కోళ్లు, మేకలు, గొర్రెలు, పందులు, కుక్కలు, పెరటికోళ్లు, బాతులు, సేద్యపు ఎద్దులు ఇలా వేర్వేరుగా నమోదు చేశారు. పశు సంపదతో పాటు ఆ గ్రామంలో పశువైద్యశాల ఉందా? లేదా? పాలసేకరణ కేంద్రం, పశుగ్రాస క్షేత్రాలు ఉన్నాయా? లేదా? పశుగ్రాసాన్ని కొనుగోలు చేస్తున్నారా? లేక సొంతంగా చేపడుతున్నారా? తదితర విషయాలను నమోదు చేశారు. పశు యజమాని అక్షరాస్యుడా? నిరక్షరాస్యుడా? పశు సంపద ద్వారా ఎంత ఆదాయం వస్తుంది? పశువుల షెడ్డు ఉందా? ఆరుబయట పశువులను కడుతున్నారా? గొర్రెల సొసైటీలు ఉన్నాయా? పశు వధశాల ఉందా? పశువుల సంరక్షణలో పురుషులు/స్త్రీలు ఎవరు ఎక్కువ సంరక్షణ చేస్తున్నారు? తదితర విషయాలను కూడా పశు గణకులు సేకరించారు.

త్వరలో వెల్లడయ్యే అవకాశం

21వ జాతీయ పశుగణన జిల్లాలో పూర్తి చేశారు. పశుగణనలో మూగజీవాల సంఖ్యను కేంద్ర ప్రభుత్వం వెల్లడించాల్సి ఉంది. దేశవ్యాప్తంగా ఒకేసారి గణనలో గుర్తించిన మూగజీవాల వివరాలను వెల్లడిస్తారు. ఏప్రిల్ 15న ముగిసిన జాతీయ పశుగణన వివరాలను వెల్లడిస్తే దాని ప్రకారం పశువుల అవసరాలకు అనుగుణంగా బడ్జెట్, పశువులకు అవసరమయ్యే వ్యాక్సిన్లు, మందులు, పథకాలు రూపొందించే అవకాశముంటుంది. దేశవ్యాప్తంగా ఎన్యూమరేషన్ పూర్తయిన తర్వాత ఫలితాలు విడుదలయ్యే అవకాశముందని పశు సంవర్ధక శాఖ అధికారులు తెలియజేస్తున్నారు.

క్లుప్తంగా

బోటు బోల్తా పడి మత్స్యకారుడి గల్లంతు



శ్యామ్ కోసం కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు



గల్లంతైన శ్యామ్

కొత్తపల్లి: సముద్రంలో వేటకు వెళ్లిన బోటు ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఒక మత్స్యకారుడు గల్లంతు కాగా మరో ఇద్దరు మత్స్యకారులు సురక్షితంగా తీరానికి చేరుకున్నారు. వారి కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పాడ నాయకర్ కాలనీకి చెందిన మేరుగు శ్యామ్ అదే గ్రామానికి చెందిన రామిశెట్టి వీరబాబు, వంకా ఇస్సాక్ బోటుపై మంగళవారం తెల్లవారుజామున 3గంటలకు చేపల వేటకు వెళ్లారు. తుపాను ప్రభావంతో సముద్రం ఉధృతంగా ఉండడంతో హోప్ హైలాండ్ సమీపంలో బోటు బోల్తా పడింది. బోటులో ఉన్న మేరుగు శ్యామ్ గల్లంతుకాగా వీరబాబు, ఇస్సాక్ హోప్ హైలాండ్ తీరానికి చేరుకున్నారు. మత్స్యకారులు, అధికారులు గల్లంతైన శ్యామ్ కోసం బోట్లపై గాలింపు చర్యలు చేపట్టారు. శ్యామ్ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



చైతన్య జనార్దన (ఫైల్)

కొత్తపేట: ఇద్దరు మోటారు సైక్లిస్టులు ఎదురెదురుగా ఢీకొనగా ఒక మోటార్ సైక్లిస్టు అక్కడికక్కడే మృతి చెందాడు. కొత్తపేట ఎస్సై జీ సురేంద్ర తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కొత్తపేట కమ్మిరెడ్డిపాలెం ప్రాంతానికి చెందిన వాడ చైతన్యజనార్దన (36) సోమవారం రాత్రి ఒక పని నిమిత్తం మోటార్ సైకిల్‌పై రావులపాలెం వెళ్లి తిరిగి అర్ధరాత్రి 1.45 గంటల సమయంలో ఇంటికి వస్తుండగా మందపల్లి వంతెన సమీపంలో కొత్తపేట వైపు నుంచి మోటార్ సైక్లిస్టు అతి వేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108 అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. చైతన్యజనార్దనను ఢీకొన్న మోటార్ సైక్లిస్టుకు కూడా గాయాలైనట్టు ఎస్సై సురేంద్ర తెలిపారు. మృతుని భార్య వాడ చిన్నారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేంద్ర తెలిపారు.

బంగారు భవిత కోసం

- ఇంటింటికీ వెళ్లి ఐఈఆర్‌పీల సర్వే
- సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి

రాయవరం: దివ్యాంగులను గుర్తించేందుకు సహిత విద్య ఐఈఆర్‌పీ (ఇంక్లుజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్)లు సర్వే ప్రారంభించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఇంటికి పరిమితం కాకుండా..వారిని శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చేసేందుకు ఏర్పాటు చేసిన భవిత కేంద్రాల పరిధిలో ఈ గుర్తింపునకు ప్రత్యేక సర్వే చేపడుతున్నారు. ప్రత్యేక అవసరాలుగల పిల్లలు మిగిలిన పిల్లల మాదిరిగానే అన్ని అవకాశాలను అంది పుచ్చుకునే విధంగా ప్రతి మండలానికి ఒక భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేసి సహిత విద్యను ప్రవేశ పెట్టారు. జిల్లాలోని 22 మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున భవిత కేంద్రాలు ఏర్పాటు చేశారు.

వీటి ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు మిగిలిన పిల్లలతో సమానంగా విద్యను అందించడంతో పాటు వారికి అవసరమైన పరికరాలను అందిస్తున్నారు. సమాజంలో ఇంకా మిగిలి ఉన్న ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించడానికి సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ పర్యవేక్షణలో భవిత కేంద్రాల ఐఈఆర్‌పీలు సర్వే చేస్తున్నారు. ఇంక్లుజన్-2025లో భాగంగా దివ్యాంగ పిల్లలందరికీ వారికి అవసరమైన విద్యను అందించడం, ప్రతి చిన్నారిని వారి వయసుకు తగ్గట్టుగా పాఠశాలలో చేర్పించడమే లక్ష్యంగా ఈ సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే దివ్యాంగ పిల్ల విద్యను డిజిటలైజేషన్ చేసి, ట్యాబ్స్‌ను అందజేస్తున్నారు.



ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపునకు సర్వే నిర్వహిస్తున్న ఐఈఆర్‌పీ

ప్రత్యేక సేవలు

మానసిక దివ్యాంగుల్లో విద్యార్థి దశలో ఉన్నవారికి విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు ప్రతివారం ఫిజియోథెరపీ సేవలను అందజేస్తున్నారు. ప్రత్యేక అవసరాలు గల వారిని గుర్తించి, వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించడం, పాఠశాలలకు రప్పించేలా భవిత కేంద్రంలోని ఐఈఆర్‌పీలు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 13వ తేదీ నుంచి ప్రతి మండలంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గుర్తించేందుకు ఐఈఆర్‌టీలు ప్రత్యేక సర్వే చేపట్టారు.

ప్రత్యేక వైద్య శిబిరాలు

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో మెడికల్ అసెస్‌మెంట్ క్యాంపులు ఏర్పాటు చేశారు. రావులపాలెం, రామచంద్రపురం, ముమ్మిడివరం, రాజోలు, అమలాపురంలో ఏర్పాటు చేసిన శిబిరాల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన ఉపకరణాలను గుర్తించి, వాటి కోసం దరఖాస్తులు స్వీకరించారు. సుమారు 800 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని గుర్తించి, మెంటల్లీ రిటార్డెడ్(ఎంఆర్), హియరింగ్ ఇంపైర్డ్(హెచ్ఐ), విజువల్లీ ఇంపైర్డ్(వీఐ), సెరిబ్రల్ పాలసీ కింద నాలుగు విభాగాలుగా విభజించారు. ఈ క్యాంపులకు పాఠశాలలకు రాకుండా ఇంటి వద్ద ఉండేవారు కూడా వచ్చారు.

జిల్లాలో 2,586 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఉన్నారు.

వీరు కాకుండా, గతేడాది జూన్‌లో నిర్వహించిన సర్వేలో పాఠశాలలకు రాకుండా ఇంటి వద్ద ఉన్న 236 మందిని గుర్తించారు. సర్వే అనంతరం వారిని అంగన్‌వాడీ కేంద్రం లేదా ప్రాథమిక పాఠశాలల్లో చేర్పిస్తారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో కూడా సెలవు రోజుల్లోనే సర్వే చేయాలని అధికారులు ఐఈఆర్‌పీలను ఆదేశించారు. స్థానిక అంగన్వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ల సహాయంతో సర్వే చేపడుతున్నారు.

నాలుగు రకాల అలవెన్స్‌లు

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నాలుగు రకాల అలవెన్స్‌లను ప్రభుత్వం అందజేస్తోంది. ఎస్కార్ట్, ట్రాన్స్‌పోర్ట్, హోమ్ బేస్డ్, రీడర్ అలవెన్స్‌లను అందజేస్తున్నారు. అంధులకు రీడర్ అలవెన్స్‌గా 10 నెలలకు రూ.2,000 అందజేస్తున్నారు. బడికి వచ్చే వారికి ఎస్కార్ట్ అలవెన్స్ కింద ఒక్కో విద్యార్థికి పది నెలలకు రూ.3,000 అందిస్తున్నారు. ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ పది నెలలకు రూ.3,000 ఇస్తున్నారు. గరల్ చైల్డ్ అలవెన్స్ 10 నెలలకు రూ.2,000 అందజేస్తున్నారు. హోమ్ బేస్డ్ అలవెన్స్ పది నెలలకు రూ.3,000 అందజేస్తున్నారు.

ప్రతి ఒక్కరినీ గుర్తించేందుకే..

ప్రతి ఒక్కరినీ పథకం కిందకు తీసుకురావాలనే ఉద్దేశంతో సర్వే నిర్వహిస్తున్నాం. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు విద్యను అందిస్తాం. భవిత కేంద్రాలకు రాని వారికి హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్‌ను అందిస్తున్నాం.

– డాక్టర్ షేక్ సలీం బాషా, జిల్లా విద్యాశాఖాధికారి, అమలాపురం

సేవలు అందించేందుకు సర్వే

భవిత కేంద్రాల పరిధిలో విద్యతో పాటుగా, వారి అవసరమైన సేవలు అందించేందుకు సర్వే నిర్వహిస్తున్నాం. ప్రతి చిన్నారిని గుర్తించి, భవిత కేంద్రాల్లో చేర్పిస్తాం.

– జి.మమ్మీ, అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్, సమగ్ర శిక్షా, అమలాపురం

ప్రభుత్వ అధికారిని అంటూ బెదిరింపులు

మీనాక్షి పేరుతో ఫోన్ కాల్స్

రాజమహేంద్రవరం రూరల్: మీనాక్షి పేరుతో 70326 72067 నంబరు నుంచి ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లు, స్కాన్ సెంటర్లకు ప్రభుత్వ అధికారిగా ఆమె పరిచయం చేసుకుంటుంది. ఆపై డబ్బు డిమాండ్ చేస్తూ బెదిరిస్తుంది. ఈ విషయం బొమ్మూరులోని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు దృష్టికి వెళ్లింది. మీనాక్షి పేరుతో డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఎవరూ పనిచేయడం లేదని, తమ కార్యాలయానికి ఆమెకు సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. బెదిరింపు కాల్స్ వస్తే ఫోన్ నంబర్, సమయం, సంభాషణ వివరాలు వెంటనే డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయానికి పంపాలన్నారు. ఈ కాల్స్‌పై ఇప్పటికే ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. బెదిరింపు కాల్స్ వస్తే జిల్లా ప్రైవేట్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ అధికారి డాక్టర్ రాజీవ్ 81255 67830 నంబర్‌కు తెలియజేయాలని తెలిపారు.

అలల కల్లోలం

కూలుతున్న మత్స్యకార గృహాలు

కొత్తపల్లి: ఉపరితల ఆవర్తన ద్రోణితో తీరంలో మత్స్యకారుల గృహాలపై సముద్రపు అలలు విరుచుకుపడుతుండడంతో క్షణాల్లోనే కడలిలో కలిసిపోతున్నాయి. ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో తీర ప్రాంతంలో కడలి కల్లోలంగా మారింది. కెరటాలు ఎగసి పడుతున్నాయి. ఉప్పాడ, కోనపాపపేట తీర ప్రాంతాల్లో ఉన్న ఇళ్లు కోతకు గురవుతున్నాయి. తీర ప్రాంతానికి రక్షణగా నిర్మించిన గోడ రాళ్లు సైతం అలల తాకిడికి గ్రామంలోకి వచ్చి పడ్డాయి. కెరటాల తాకిడికి ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డు కోతకు గురైంది. తుపాను ప్రభావంతో సముద్రపు అలలు ఎగసి పడుతున్నాయి. కెరటాలు రోడ్డు మీదకు ఎగసి పడుతుండడంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు.



ఉప్పాడలో కోతకు గురవుతున్న మత్స్యకార గృహాలు



ఉప్పాడలో కోతకు గురవుతున్న సీసీ రోడ్డు



ఉప్పాడలో కోతకు గురవుతున్న తీరం

పలు రైళ్ల రద్దు

రాజమహేంద్రవరం సిటీ: పరిపాలనా వ్యవహారాల్లో భాగంగా జిల్లా మీదుగా నడిచే పలు రైళ్లను ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం ప్రకటించారు. ఈ నెల 21న షాలిమార్ – సికింద్రాబాద్(22849), 22న శాంత్రగచ్చి–యశ్వంతపూర్(02863) 23న హౌరా– మైసూర్ (22817), సికింద్రాబాద్–షాలిమార్(22850), 24న యశ్వంతపూర్– శాంత్రగచ్చి(02864) 25న మైసూర్–హౌరా(22818) ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు.

డాక్టర్ యనమదలకు తపన సేవా పురస్కారం



డాక్టర్ యనమదల మురళీకృష్ణ

కాకినాడ క్రైం: ఆరోగ్య విజ్ఞాన రచనల ద్వారా ప్రజారోగ్య రంగంలో తన వంతు కృషి చేస్తున్న కాకినాడకు చెందిన వైద్యుడు యనమదల మురళీకృష్ణకు సత్యసాయి జిల్లా హిందూపురంలోని తపన సాహిత్య వేదిక సేవా పురస్కారం ప్రకటించింది. తపన సాహిత్య వేదిక వ్యవస్థాపకుడు, మాండలిక రచయిత సడ్లపల్లి చిదంబరరెడ్డి ఏటా తెలుగులో ఉత్తమ రచనలకు సడ్లపల్లె కథా పురస్కారాలు ప్రదానం చేస్తున్నారు.

2025 సంవత్సరానికి తెలుగు రాష్ట్రాలలో కోవిడ్, ఎయిడ్స్, గుండెజబ్బులపై తన రచనల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, భరోసానిస్తున్న డాక్టర్ యనమదల మురళీకృష్ణను ఈ ఏడాది సేవా పురస్కారానికి ఎంపిక చేసినట్టు సంస్థ ప్రకటించింది. డాక్టర్ మురళీకష్ణ 2000 సంవత్సరంలో ఎయిడ్స్ పేరుతో పుస్తకాన్ని ప్రచురించారు. 2022లో కోవిడ్ ఎయిడ్స్ నేను, 2024 మే నెలలో హెచ్ఐవీ ఎయిడ్స్, అదే ఏడాది జూన్ నెలలో హెచ్ఐవీ ఎయిడ్స్ ఇన్ ఇండియా అండ్ డెవలపింగ్ కంట్రీస్ పుస్తకాలను వెలువరించారు. ఈ ఏడాది జూన్ 22న హిందూపురంలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు.

తల్లితో సహజీవనం.. కూతురిపై అఘాయిత్యం

పోలీస్ స్టేషన్ ఆవరణలోనే యువతిపై హత్యాయత్నం

అనపర్తి : సమాజం సిగ్గుతో తలదించుకునేలా తల్లితో సహజీవనం చేస్తున్న వ్యక్తి ఆమె కుమార్తెను వివాహం చేసుకుంటానంటూ శారీరకంగాను, మానసికంగాను వేధిస్తున్నాడని మంగళవారం వివాహిత విలేకరుల ముందు కన్నీటి పర్యంతమైంది. వివరాల్లోకి వెళితే అనపర్తికి చెందిన వివాహితకు ఇద్దరు కుమార్తెలు భర్త 2016లో గుండెపోటుతో చనిపోయాడు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన నాగిరెడ్డితో ఆమెకు ఏర్పడిన పరిచయం కాస్తా సహజీవనానికి దారితీసింది. తల్లితో సహజీవనం చేస్తున్న వ్యక్తి బీటెక్ చదువుతున్న పెద్ద కుమార్తెతో వివాహం చేయాలని ఆమెపై ఒత్తిడి తెస్తున్నాడని పలుమార్లు స్థానిక పెద్దల వద్ద మొర పెట్టుకున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో సోమవారం పెద్దల సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్లింది. అక్కడ నిందితుని తల్లి నా కుమారుడిపై కేసు పెడతావా అంటూ ఆ యువతిపై దాడి చేసి గట్టిగా పీక నొక్కడంతో యువతి అపస్మారక స్థితికి చేరుకుంది. స్థానికులు, పోలీసులు ఆమెను అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వివరాలు తెలుసుకుని సమాచారాన్ని పోలీసులకు అందించి యువతికి చికిత్స అందిస్తున్నామని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామగుర్రెడ్డి తెలిపారు. యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎల్.శ్రీనునాయక్ తెలిపారు.

నలుగురిపై పోక్సో కేసు

మలికిపురం: తనను మోసం చేశాడని ఒక యువకుడిపై లక్కవరం గ్రామానికి చెందిన బాలిక ఇచ్చిన ఫిర్యాదుపై నలుగురిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు మలికిపురం ఎస్సై పి.వి.వి. సురేష్ మంగళవారం తెలిపారు. లక్కవరంలో బంధువుల ఇంటికి వచ్చిన ఏలూరుకు చెందిన ఎం.రాకేశ్‌తో లక్కవరం గ్రామానికి చెందిన బాలిక 2023లో ప్రేమలో పడి హైదరాబాద్‌కు వెళ్లింది. వారు సహ జీవనం చేశారు. వీరి మధ్య విభేదాలు రాగా.. పెద్దల చేసిన రాజీ ప్రయత్నం కుదరలేదు. దీంతో యువతి ఇచ్చిన ఫిర్యాదుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి యువకుడితో పాటు మరొక ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

పీడీ యాక్టుపై మహిళ అరెస్టు

రౌతులపూడి: నవోదయం -2లో భాగంగా రౌతులపూడి మండలం గిడజాం గ్రామానికి చెందిన గొలుసు లక్ష్మిపై పీడీయాక్టుపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని మంగళవారం తుని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పట్టాభి చౌదరి తెలిపారు. సారా అమ్మకాలు, కొనుగోలు చేపట్టవద్దు అని అనేకసార్లు చెప్పినా పట్టించుకోకుండా తరచూ సారా అమ్మకాలు చేపడుతోందని అన్నారు. రెండురోజులు క్రితం సారా కేసులో అరెస్టు అయిన ఆమెపై ఇప్పటివరకు ఐదు కేసులు నమోదయ్యాయన్నారు. ఈ మేరకు కాకినాడ జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు ఆదేశాల మేరకు ఆమెపై పీడీ యాక్టు నమోదు చేసి సెంట్రల్ జైల్‌కు తరలించామన్నారు.

క్రైస్తవులకు కూటమి ప్రభుత్వం వ్యతిరేకం

- ఆర్ఎస్ఎస్ ప్రతినిధులుగా వ్యవహరిస్తున్న ఐజీ, ఎస్పీ
- 24న పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభ
- అనుమతి ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు
- మాజీ ఎంపీ హర్షకుమార్



విలేకరులతో మాట్లాడుతున్న హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం క్రైస్తవులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని, ఈ నెల 24న జరిగే పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభకు అనుమతి ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ హెచ్చరించారు. మంగళవారం రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ డిగ్రీ కాలేజీ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐజీ, ఎస్పీలు ఆర్ఎస్ఎస్ ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. వారికి గతంలో ఆర్ఎస్ఎస్‌తో సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రతీ చర్చిలో మీటింగులు పెట్టి ఈ నెల 24వ తేదీన జరిగే ప్రవీణ్ పగడాల సంస్మరణ సభకు వెళ్లవద్దని, వెళ్లిన వారిపై అరెస్టులు చేసి, కేసులు పెడతామంటూ బెదిరింపులకు గురి చేస్తున్నారని అన్నారు. ఈ ఘటనపై మాట్లాడినా, పోస్టర్లు ముద్రించినా, సోషల్ మీడియాలో ప్రచారం చేసినా కేసులు పెడతామని ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ప్రవీణ్ పగడాల సంస్మరణ సభకు సంబంధించిన పోస్టర్ వేశామన్నారు. ఆ పోస్టర్‌లో కొంతమంది పెద్దల పేర్లు వేశామని తెలిపారు. వారిని ఎమ్మార్వో ఆఫీస్‌కు పిలిపించి రూ.50 వేల సొంత పూచీకత్తు కట్టించుకుని, బైండోవర్ కేసులు పెట్టారని తెలిపారు. క్రైస్తవులకు మీటింగులు పెట్టుకునే హక్కు లేదని ప్రకటిస్తే మేము మీటింగులు పెట్టబోమన్నారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి హత్యగానే నమ్ముతున్నామన్నారు. ప్రవీణ్ పగడాల హత్యపై రీ పోస్టుమార్టం చేయిస్తామన్నారు. ప్రవీణ్ ప్రగడాల సంస్కరణ సభ జరగనివ్వకపోతే రాష్ట్ర వ్యాప్తంగా జరిగే పరిణామాలకు పోలీసులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రవీణ్ ప్రగడాల హత్య వెనుక చాలా పెద్ద హస్తమే ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ప్రవీణ్ ప్రగడాల సంస్కరణ సభకు ఒకరోజు ముందుగానే 50 మంది బిషప్‌లు వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని క్రైస్తవ సంఘాలు, యువజన సంఘాలు ఈ సభకు తరలి వస్తున్నాయని ఎక్కడైనా ఆపితే అక్కడకక్కడే ధర్నా చేసి సభ నిర్వహిస్తారని, రాష్ట్రం అల్లకల్లోలం అవుతుందని దానికి బాధ్యులు పోలీసులే అవుతారని పేర్కొన్నారు. శాంతియుతంగా సభ నిర్వహిస్తామని, దానిని పరిరక్షించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని పేర్కొన్నారు.

జాతీయ జెండాకు మహా అవమానం


పిఠాపురం: మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అధ్యక్షతన మంగళవారం పిఠాపురంలో నిర్వహించిన మినీ మహానాడులో జాతీయ జెండాకు అవమానం జరిగింది. పిఠాపురం మున్సిపల్ కల్యాణ మండపంలో నిర్వహించిన మహానాడుకు ముందు తెలుగుదేశం పార్టీ శ్రేణులు జాతీయ జెండాలతో నిర్వహించిన ర్యాలీలో జాతీయ జెండాను తిరగేసి పట్టుకోవడం విమర్శలకు దారి తీసింది. ఇదే కార్యక్రమంలో భారతమాతకి జై అంటూ మరో నాయకుడు సిగరెట్ కాల్చుకుంటూ ర్యాలీలో పాల్గొనడం చర్చనీయాంశం అయ్యింది.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,500
గటగట (వెయ్యి)	20,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,500
గటగట (వెయ్యి)	19,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

చోరీ సొత్తుతో సహా నిందితుడి అరెస్ట్

- రూ.10 లక్షల నగదు రికవరీ
- 24 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు



కేసును వివరిస్తున్న డీఎస్పీ శ్రీహరి రాజు. చిత్రంలో సీసీఎస్ ఇనస్పెక్టర్ అంకబాబు, ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు, అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు తదితరులు

అన్నవరం: స్థానిక బస్ కాంప్లెక్స్ వద్ద ప్రయాణికుడి బ్యాగ్ కోసి రూ.10 లక్షలు అపహరించిన నిందితుడిని 24 గంటల వ్యవధిలోనే పోలీసులు అరెస్ట చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు. పెద్దాపురం డీఎస్పీ డీ శ్రీహరి రాజు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. గుంటూరుకు చెందిన బోడపాటి నాగేశ్వరరావుకు తునిలో ఇంటి స్థలం ఉంది. దానిని ఆయన తన స్నేహితుడు భానుప్రకాష్ ద్వారా రూ.20 లక్షలకు ఇటీవల విక్రయించారు. ఆ మేరకు రూ.10 లక్షల నగదు, మరో రూ.10 లక్షల చెక్కును బ్యాగులో పెట్టుకుని సోమవారం ఉదయం తునిలో ఆర్టీసీ బస్సు ఎక్కి అన్నవరం బస్‌కాంప్లెక్స్‌లో దిగారు. బస్‌కాంప్లెక్స్‌లో గుంటూరు బస్సు కోసం వేచి చూస్తుండగా మరో వ్యక్తి ప్రయాణికుడిలా నటిస్తూ ఆయనతో మాటలు కలిపారు. అనంతరం ఆయనను మభ్యపెట్టి పదునైన చాకుతో బ్యాగ్ కోసి రూ.పది లక్షల నగదు అపహరించి పారిపోయాడు. మధ్యాహ్నం ఆయన గుంటూరు బస్సు ఎక్కే సమయంలో బ్యాగ్ చూడగా కోసి ఉంది. దీంతో ఆయన కంగారుగా బస్సు దిగి చూడగా బ్యాగ్‌లో రూ.10 లక్షలు లేవు. దీంతో ఆయన సోమవారం మధ్యాహ్నం అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్ కాంప్లెక్స్‌లో తనను మాటల్లో పెట్టిన వ్యక్తే చోరీ చేసుంటాడని అనుమానం వ్యక్తం చేశారు. డీఎస్పీ శ్రీహరి రాజు, పెద్దాపురం సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అంకబాబు, ప్రత్తిపాడు సీఐ బీ సూర్య అప్పారావు, అన్నవరం ఎస్ఐ శ్రీహరి బాబు, ఏఎస్సై బలరామ్, హెడ్ కానిస్టేబుల్ రాధాకృష్ణ బాధితునితో మాట్లాడారు. నేరస్తుడిని పట్టుకునేందుకు నాలుగు బృందాలు ఏర్పాటు చేశారు. అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని మండపాం సెంటర్ వద్ద మంగళవారం మధ్యాహ్నం ఒక వ్యక్తి బ్యాగ్ పట్టుకుని అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అతడిని ప్రశ్నించడంతో ఆ నేరం తానే చేసినట్టు అంగీకరించాడు. అతడిని విశాఖకు చెందిన కంబాల శ్రీనుగా గుర్తించారు. అతని వద్ద గల బ్యాగ్‌లో చోరీ సొత్తు రూ.10 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిని అరెస్ట్ చేసి ప్రత్తిపాడు మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చినట్లు డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. ఈ కేసును 24 గంటల్లో ఛేదించిన పోలీసులను ఎస్పీ జీ బిందుమాధవ్ అభినందించారు.